# ఋణగ్రస్తులు

ఎమ్. సుగుణారావు



ఏటి ఒడ్డున కూర్చున్నాడు పరమేశం. పల్లెపదం పాడుతున్న శ్రమజీవుల గీతాలు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి. ఆ పల్లెటూరు నిశ్శబ్దంగా వుంది నగర జీవితపు ధ్వని కాలుష్యం లేకుండా. అయినా ఆ ప్రశాంత వాతావరణంలో అతడి శాంతిని దూరం చేస్తున్న ఆలోచనలు. మనసును స్థిరంగా వుంచుకోవడానికి అతడు చేస్తున్న విశ్వప్రయత్నం. దారపు పోగుల్లా చిక్కువీడని ఆలోచనల ముడులు. వద్దనుకున్నా కళ్ళముందు కదలాడుతున్న గతం. ఐదేళ్ళ వయసులో వుండగా తండ్రి వైరాగ్యంతో ఇల్లొదిలి వెళ్ళిపోయాడు.

కొడుకు వెళ్ళిన దుఃఖంలో తాతగారు బెంగతో చనిపోయారు. ఒంటరిదైనా తల్లి అధైర్యపడలేదు. కొడుకుని విద్యావంతుణ్ణి చేయాలనే లక్ష్యంతో రాత్రింబవళ్ళూ యంత్రంలా కష్టపడింది. ఆమె ఆవేదనను అర్థం చేసుకున్న అతడూ తనవంతు విధి నిర్వర్తించాడు. ఏ మగదిక్కులేని ఓ మహిళ రెక్కలకష్టం వృధాకాలేదు. అందరూ ఆశ్చర్యపడే విధంగా మెడిసిన్ చదువు పూర్తిచేశాడు. పోస్టుగ్రాడ్యుయేషన్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడు. అమెరికాలోని ఒక కేన్సర్ పరిశోధనాలయంలో సూపర్

## జననం

నిలబడితే
క్షణాలు గాజుపెంకులు గుచ్చుకున్నట్టు
అడుగుతీసి అడుగేస్తే
అరంగుళం దూరం కూడా అగాధమైనట్టు
శ్వాసిస్తే
సముద్రాలన్నీ ముంచేసినట్టు
దేన్ని చూసినా భయాన్ని చూసినట్టే
ఆసుపత్రి వరండా ఎడారిలో
నేనొక వొంటరి అశ్రుబిందువు
స్ట్రెచ్చర్ మీద ప్రేమగా దీవించిన చూపులు
పెదవుల మీద మెరిసిన చిర్నవ్వులు
ఆపరేషన్ థియేటర్ తలుపులు దాటి వెళ్తుంటే
చుట్టూ చీకటి ముసురుకున్నట్టు
సర్రునజారి 'హిమాలయాల మీంచి పడిపోతున్నట్టు
ప్రపంచం మునిగిపోయి
ఒక్కణ్ణే మిగిలిపోతాను
ఏడవాలనే వుంటుంది ఏడవలేను
రెండు కళ్లూ రెక్కలాడిస్తూ ఆసుపత్రంతా వెదుకుతుంటాయి
పిచ్చిగా అరవాలనే వుంటుంది
ఎక్కడ పడిపోయిందో నా గొంతు కనబడదు
శరీరంనిండా గొలుసులు వేసినట్టు
ఆలోచనల్ని మోయటమే కష్టంగా వుంటుంది
బ్లేడుతో వేలు తెగినట్టు
లోతుగా ఓ జ్ఞాపకం కోసుకుంటుంది
ఆసుపత్రి ద్వారానికి వేలాడదీసిన నీలి కర్టెన్ ఆకాశం
మెట్లు మెట్లుగా ఆసుపత్రి వరండాలోకి పరుచుకున్న మేఘాలు
తల్లిదండ్రులు కనిపించక విలపిస్తున్న ఓ పిల్లాడి చేతిలో
చందమామనీ ఇంద్రధనుస్సునీ పెడ్తూ ఊరడిస్తున్న ఓ స్త్రీ మూర్తి
పిల్లాణ్ణి పట్టుకుని ఎన్ని మెట్లు నడిచిందో
పిల్లాణ్ణి మురిపిస్తూ ఎన్ని సంవత్సరాల్ని మరిచిపోయిందో
పిల్లాణ్ణి సవరిస్తూ సానబడుతూ
తాను ఎన్ని ముక్కలయ్యిందో –
ఆసుపత్రి మెట్ల మీదికొచ్చేవరకూ తెలియదు
కన్నతల్లైతే పాలిచ్చి పెంచేది
నన్ను ప్రేమలో ముంచి పెంచిన తల్లి
ఆమె గుండెను పిండి పోషించిందేమో
అందుకే గుండె ఛిద్రమైంది
భళ్లున తెల్లారినట్టు
వెల్తురంతా పువ్వులైనట్టు
నా కనురెప్పలు విచ్చుకున్నట్టు
ఎదురుగా ఆపరేషన్ థియేటర్ తలుపులు
ఆయాలూ సిస్టర్లూ వార్డ్ బాయ్‌లూ
అప్పుడే జన్మించిన బిడ్డని చూపించినట్టు
ఆపరేషన్ చేసిన స్ట్రెచర్ మీది తల్లిని చూపించారు
నేను మరొక్క జన్మనెత్తాను
లోకంలోని తల్లుల్లారా!
ఎన్నిసార్లయినా సరే!–
మా ప్రాణాలిచ్చి
మిమ్మల్ని బతికించుకుంటాం!

– ఆశారాజు

*(నిమ్స్‌లో 28-7-93న మా అక్క సుశీలబాయికి బైపాస్ ఆపరేషన్ జరిగినప్పుడు నేను నలిగిపోయిన క్షణాలు)*

---

స్పెషలైజేషన్‌చేసి ఆ కేంద్రంలోనే మంచి ఉద్యోగం సంపాదించాడు. ఐదేళ్ళుగా అమెరికాలోనే వుండడంతో అక్కడి పరిసరాలు, పురస్కారాలు వదిలి రాబుద్ధి కావడంలేదు. ఈ పల్లెటూళ్ళోవున్న ఒంటరి తల్లి కోసం రాక తప్పదు. సంవత్సరానికి ఒకసారే వస్తాడు. ఏ అర్థరాత్రో తల్లి జ్ఞాపకం వస్తే గుండె విలవిలలాడుతుంది. డిప్రెస్ అయిపోతాడు. ఈ సంవత్సరమే ఆమెనూ అక్కడికే తీసుకువెళ్ళేందుకు పరిస్థితులు అనుకూలించాయి. తమ పాత ఇంటిని అమ్మేసి ఆమెను తీసుకువెడదామనే ప్రయత్నంలో వచ్చాడు. ఆమె నిర్ణయం విని అతడిలో అలజడి చెలరేగింది. ఏం చెయ్యాలో అర్థంకాని పరిస్థితి. ఆమె మాటలు పదే పదే గుర్తుకొచ్చి మనసులో బాధ తీవ్రతరమవుతుంది.

" నేను ఈ వూరొదిలి రాలేనురా... నన్నిక్కడే కడతేరనీ... ఈ మట్టిలోనే పుట్టాను. ఈ గాలిపీల్చి, ఈ నీళ్ళు తాగి ఈ జీవితాన్ని ఇన్నాళ్ళూ నెట్టుకొచ్చాను, ఈ మట్టిలోనే నన్ను కలిసిపోనీరా...!"ఆ మాటలు అతడి గుండెను కోస్తున్నాయి.

తెల్లవారే లేచి, కోనేరులోంచి నీళ్ళు తెచ్చుకుని, స్నానం చేసి పూజ చేసుకుంటుంది. ఆ చుట్టు పక్కల ఆడవాళ్ళంతా ఆమె దగ్గరకే చేరుతారు. అందరికీ ఆమె మాటే వేదం. తను ఏ రకమైన వృత్తి చేపట్టి కొడుకును పైకి తీసుకువచ్చిందో ఆ వృత్తిని ఆమె వదిలిపెట్టలేదు. ఆమె ద్వారా విస్తరిస్తున్న కుటీర పరిశ్రమలో అప్పడాలు, విస్తరాకులు, పచ్చళ్ళు తయారుచేసి పట్నంలోని హోటళ్ళకు పంపించడం – తను నెల నెలా పంపే డబ్బులు తన పేరే బాంకులో దాస్తుంది. తనకు అవసరమయ్యే డబ్బు ఈ వయసులో తానే స్వయంగా సంపాదించుకుంటుంది.

ఆలోచనల్లో వున్నవాడల్లా సాయంకాలం అవడం గమనించలేదు. గబగబా అడుగులు వేయసాగాడు. ఆ నిశ్శబ్ద వాతావరణంలోకి అలలా దూసుకుంటూ వచ్చి చెవుల్ని తాకింది ఒక చక్కటి స్వరం...

కోనేరు నుంచి అగ్రహారానికి తీసుకెళ్ళే కాలిబాట. దానికి ఇరువైపులా స్వాగతం పలుకుతున్న వంది మాగధుల్లా వినయంగా నిలుచుకున్న కొబ్బరిచెట్లు. అగ్రహారం అవతలవైపువున్న పచ్చిక మైదానంలోంచి వస్తున్న పశువుల మందలు. వాటి నుంచి వేరుపడి ఒంటరిగా వస్తున్న ఓ గేదె. దానిపై కూర్చున్న ఒక పదహారేళ్ళ కుర్రాడు. నిక్కరేసుకున్నాడు. ఒంటిపై చొక్కాలేదు. నల్లగా బొద్దుగా వున్నాడు. చూపులు నేలమీద నిలిచివున్నాయి. గొంతెత్తి పాడుతున్నాడు. ఆ పాట వింటుంటే ఏదో మాటల్లో చెప్పలేని స్వాంతన కలిగింది. అతడు తలొంచుకుని పాడుకుంటుంటే ఆ గేదె మంత్రముగ్ధలా నడుస్తోంది. ఆ దృశ్యాన్నే దీక్షగా చూసిన పరమేశానికి అర్థమయింది– ఆ కుర్రాడు గుడ్డివాడని. ఎవరి సాయమూ లేకుండా అతడలా గేదెపై ఒంటరి ప్రయాణం సాగించడం విచిత్రం అనిపించింది. ఇంటికి వెళ్ళగానే తల్లిని అడిగేదు అతడి విషయం. – "వాడు పుట్టిగుడ్డిరా నాయనా, తల్లి

దంద్రులకు ఆలస్యంగా పుట్టాడు. వాడికున్న ఏకైక నేస్తం ఆ గేదె. దాన్ని పొద్దున్నే మేపుకు తీసుకెళ్ళి సాయంత్రం తీసుకొస్తాడు. పాలు తనే పితుకుతాడు. తండ్రికి సంవత్సరం క్రితం పక్షవాతం వచ్చి రెండు కాళ్ళు పడిపోయాయి. అప్పటినుంచీ పొలం ఈ కుర్రాడే చూసుకుంటున్నాడు. భగవంతుడు ఈ నిర్భాగ్యుడికి కళ్ళివ్వలేకపోయినా మనసుకు మాత్రం చూపునిచ్చాడు ''

– తల్లి మాటలు వినగానే పరమేశానికి ఆ కుర్రాడి మీద జాలి కలిగింది.

'ఆ గుడ్డి నారాయణ జీవితం ఈ పల్లెటూళ్ళోనే పరిసమాప్తం కాకూడదు. వాడు చదువుకొని ప్రయోజకుడయ్యే అవకాశం వుంది. ఆ పల్లెటూరుకు రెండొందల కిలోమీటర్ల దూరంలో బ్లైండ్ స్కూలు వుంది. ఆ స్కూల్ ప్రిన్సిపాల్ తనకు తెలుసు. ప్రయత్నిస్తే ఆ కుర్రాడిని ఆ స్కూల్లో జాయిన్ చెయ్యవచ్చును, ఈ అభిప్రాయానికి వచ్చేడు పరమేశం. బాగా ఆలోచించాలి. ఈ విషయం నారాయణ తల్లిని పిలిచి చెప్పాడు. ఆమె సంతోషించింది. – "మేమెలాగూ వాడికి బ్రతుకు తెరువు చూపలేం బాబూ, మీ మూలంగానైనా వాడికోదారి దొరికితే చాలు, మేంపోతే ఈ గుడ్డివాడి బతుకు ఎలా తెల్లవారుతుందో ఏమో, ఈ సహాయం మీరు చేస్తుంటే కాదంటామా..!" అంటూ ఆమె తన సమ్మతి తెలియచేసింది. నారాయణ మాత్రం ఆ వూరొదిలి వెళ్ళడానికి ఒప్పుకోలేదు. పరమేశం, ఆ వూళ్ళో పెద్దలు బలవంతంగా ఒప్పించారు. ఆ రోజే ఆ వూరి స్కూలు టీచర్ పరమేశం ఇచ్చిన లెటర్ తీసుకెళ్ళి నారాయణను బ్లైండ్ స్కూలులో జాయిన్ చేశాడు.

* * *

పరమేశం స్టేట్స్ వెళ్ళాల్సిన రోజు దగ్గరపడింది. తల్లి తనతోపాటు రావడం లేదు అనే చేదు నిజం అతడికి మింగుడుపడడంలేదు. అలా అని చూస్తూ చూస్తూ తనకొచ్చిన అపూర్వ అవకాశాన్ని ఒదులుకోలేకపోతున్నాడు. గుండెల్లో ఏదో వెలితి. తను రాలేను అనే నిజం వెనుక కొడుకుసూ తనతోపాటు వుండమనే అభీష్టాన్ని ఆమె అతడితో చెప్పకనే చెబుతోంది. అయినా పరమేశం తిరిగి విదేశం వెళ్ళడానికే నిశ్చయించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాడు.

నారాయణను బ్లైండ్ స్కూలులో చేర్పించిన తరువాతి రోజే మద్రాసు వెళ్ళాడు ఒక సెమినార్‌లో పాల్గొనడానికి. ఆ సెమినార్‌లో అతడి శాస్త్రీయ అవగాహనకు, పరిశోధనా పటిమకు అందరూ ఆశ్చర్యపడ్డారు. స్వదేశం విడిచిపెడుతున్న ఆ విజ్ఞాన ఖనిని వదులుకుంటున్నందుకు బాధపడ్డారు. ఆ సెమినార్‌ని నిర్వహిస్తున్న డైరెక్టర్ అతడికి ఒక అవకాశం కూడా ఇచ్చాడు. తమ కేన్సర్ పరిశోధనాలయంలో సీనియర్ సైంటిస్ట్ ఉద్యోగంలో పరమేశాన్ని నియమించేందుకు తన సంసిద్ధతను వ్యక్తపరిచాడు. ఆ ప్రతిపాదనను పరమేశం మృదువుగా తిరస్కరించాడు. కారణం అమెరికాలో తనకు లభిస్తున్న అధిక జీతం. అత్యున్నత పురస్కారాలు.


సెమినార్ ముగిసిన వెంటనే మద్రాసు నుంచి విశాఖపట్నం ఫ్లైట్‌లో వచ్చాడు. అక్కణ్ణించి ట్రైన్‌లో తన ఊరికి చేరుకున్నాడు. రైల్వే స్టేషన్‌లో తల్లి పంపిన గుర్రపు బండి సిద్ధంగా వుంది, అతడిని ఇంటికి చేర్చేందుకు.

నున్నటి మట్టి రోడ్డు మీద బండి చేస్తున్న చప్పుడు శ్రావ్యంగా వుంది. బండి సాగుతోంది. ఆ రాత్రి పూట వెన్నెల్ని దాటుకుంటూ వెడుతోంది. ఆ పల్లెటూరుకు అతడొచ్చి నెలకావస్తోంది. అతడు పుట్టినప్పటి పరిస్థితులే ఇంకా ఆ వూళ్ళో వున్నాయి. ఆ పల్లె ప్రజలంతా తమ పూర్వ జీవితపు అలవాట్లలోనే బ్రతుకుతున్నారు. పరమేశంలాంటి అత్యున్నత మేధావిని ఇచ్చిన ఆ ::గారు అతడి తర్వాత ఏ ఒక్కరినీ కనీసం విద్యార్థి దశకు తేలేకపోయింది. ఆ వూరి స్కూల్లో అయిదవ తరగతి వరకే వుంది. ఇకపై చదువులకు వెళ్లాలంటే పది కిలోమీటర్లు నడిచి టౌన్ కెళ్ళాలి. టౌన్ నుంచి ఆ వూరికి సరైన రోడ్డు లేదు. వర్షాకాలంలో బస్సులు తిరగవు. ఆస్పత్రి వున్నా డాక్టర్ లేడు. సైకిల్ మీద తిరిగే ఓ నకిలీ వైద్యుడే ఆ వూరి ప్రజలపాలిట దేవుడు. అలాంటి ఊళ్ళో తల్లిని ఒదిలివెళ్ళాలంటే భయంగానూ, బాధగానూ వుంది – ఆలోచనలతో అన్యమనస్కంగా కూర్చున్నాడు బండిలో. హఠాత్తుగా ఒక పల్లెపదం వినిపించింది అతడికి. ఇదివరకూ విన్నదే. "ఆ స్వరం ఎవరిదబ్బా! అనే ఆలోచనలో పడ్డాడు.

ఆ గుర్రపు బండి చేస్తున్న చప్పుడుకు బాటకు ఇరుప్రక్కలా వున్న చెట్ల ఆకులు ఊగుతూ తాళం వేస్తున్నాయి. కొనేరులోని నీరు అతి నెమ్మదిగా శబ్దం చేస్తూ పారుతోంది. ఆ పోతుమట్ల వంతెన మీద జనం పలచబడ్డారు. ఆ ఊరి మొత్తానికి వెలిగే వీధి లైటొకటి మిణుకు మిణుకుమంటూ వెలుగుతూ, ఆ పల్లె ఉనికిని బయటి ప్రపంచానికి తెలియజేస్తోంది.

పల్లెపదం పరమేశానికి మరింత దగ్గరై ఆశ్చర్యం కలిగింది. అది నారాయణ పాట. "ఆ గుడ్డి కుర్రాడు ఎలా వచ్చాడు. స్కూల్లో వేసాం కదా!?'' బండి నడిపే సుబ్బయ్యను అడిగాడు.

"వాడు చేరిన రెండో రోజే ప్రిన్సిపాల్‌గారిని అడిగేడట బాబూ, నాకు బెంగ తిరిగింది, ఇంటికి వెళ్ళివస్తాను అని. ఆయన ఒప్పుకోకపోవడంతో ఆ రోజే రాత్రి గోడ దూకి పారిపోయివచ్చాడు బాబూ. ఒక్కడూ ఎలా వచ్చాడా అని అందరం ఆశ్చర్యపోయాం. రాగానే తన గేదెను వాటేసుకుని ఏడ్చాడు. వాడు ఈ గడ్డలోనే పుట్టాడట! ఇక్కణ్ణించి మరి ఎక్కడికీ వెళ్ళడట, తాను వెళ్ళిపోతే అమ్మకూ, అయ్యకు కూడు ఎవరు పెడతారు



అంటూ గొల్లుమన్నాడు బాబు" - సుబ్బయ్య కళ్ళు తుడుచుకున్నాడు.

ఆ మాటలకు నారాయణ మీద చాలా కోపం వచ్చింది పరమేశానికి. తను చేసిన పని నిష్ఫలం అయినందుకు బాధపడ్డాడు. 'ఇంతే వీళ్ళని బాగు చెయ్యలేం' అనుకున్నాడు. ఇక నారాయణ గురించి మరి ఆలోచించలేదు పరమేశం.

అయినా పరమేశానికి ఒక విషయం మాత్రం అర్థం కాలేదు. పదహారేళ్ళపాటు ఈ నేల మీదే పెరిగి ఈ రకమైన వాతావరణంలోనే తృప్తి చెందుతున్న ఆ గుడ్డి నారాయణ దృక్పథమే తన తల్లిదీ అని, అందుకే ఆమె ఈ పల్లె వదిలి రానంటోందని పరమేశం గ్రహించలేకపోయాడు.

మానవ శరీర నిర్మాణం, దాని భౌతిక రసాయనిక విశ్లేషణల గురించి కూలంకషంగా పరిశీలించి, పరిశోధించిన పరమేశానికి తన తల్లి మనసులో నిక్షిప్తమైన కోరిక అర్థం కాలేదు. అదే అవగతమయితే అతడు స్టేట్స్ వెళ్ళడం మానుకునేవాడేమో!? అతడి తల్లికి కొడుకును సుదీర తీరాలకు పంపడం ఇష్టం లేదు. ఆమె తనతో పాటు చిన్న వ్యవస్థను వృద్ధి చేసింది. తను పెరిగిన ఆ వూరుపట్ల ఆమెకు మమకారం వుంది. తన కొడుకు డాక్టరై ఆ వూరి ప్రజలకు సేవ చేస్తే బాగుండునని ఆ తల్లి కోరుకుంది. అయినా అతడి ఆశలూ కలలూ వేరుగా వున్నాయి. ఆ వూరికే కాదు ఆ దేశానికి కూడా అతడి సేవలు అందకుండా పోయాయి. కొడుకు ఇష్టాన్ని ఆమె అతడి సుఖం కోసం ఆమోదించింది. అతడు తనను. ఒదిలిపోతున్నందుకు క్షోభపడింది. అతడు వెడుతుంటే "బ్రెయిన్ డ్రెయిన్‌లో వలసవెళ్ళిపోతున్న మేధావులను చూసి తల్లడిల్లే భరతమాతలా ఆ ముసలి తల్లి మూగగా రోదించింది.

## మనీషి

ప్రతి మనిషిలోను
ఇద్దరు దౌర్భాగ్యులు-
ఒకడు 'మనీ'కి 'దాసోహం'
మరొకడు 'షి'కి 'దాసోహం'
ఈ రెంటికీ అతీతుడు - 'మనీషి'!

-చిమ్మపూడి శ్రీరామమూర్తి

- కొన్ని నెలలు గడిచాయి. కాలం ఒకే తీరుగా నడవదు. పరమేశం తల్లి జబ్బు పడింది. ఆ గ్రామంలోని నకిలీ వైద్యుడు ఆమెకొచ్చిన వ్యాధి అంతు చిక్కక అన్ని ప్రయోగాలు చేశాడు. విదేశంలోవున్న పరమేశానికి ఆ సమాచారం అందే సమయానికి ఆమె మరణానికి అతి చేరువలో వుంది. అతడు కంగారుపడి వచ్చి తల్లిని చూసేసరికి అతడి మేధకే అందని తీవ్రదశలో వున్న కేన్సర్. ఆ వ్యాధి మీద అతడు చేసిన పరిశోధన, సమర్పించిన పరిశోధనా పత్రాలు వెలవెలపోయాయి. అతని విజ్ఞానం ఏ మాత్రం తల్లిని బ్రతికించలేకపోయింది. 'తాను ఈ దేశం వదిలివెళ్ళకుండా వుండాల్సింది' అనుకుంటూ అతడు కుమిలికుమిలి ఏడ్చాడు.

'ఓ గుడ్డి కుర్రాడు, ఓ భూమి పుత్రుడు ఏ చదువు సంధ్యలు లేని నారాయణ తన తల్లిదండ్రుల పట్ల చూపిన ఆదరణలో ఏ కొంతైనా తను తన తల్లిపట్ల చూపలేదు. రాత్రింబగళ్ళు కష్టపడి తన జీవితమంతా కొడుకు చదువు కోసం వినియోగించిన ఆ తల్లికి తను మిగిల్చిందేమిటి?

ఈ గాలి, నీరు, వాతావరణంలో ఊపిరి పోసుకుని పెరిగి పెద్దవారై, ఈ దేశపు ఆర్థిక వనరులను తమ చదువు నిమిత్తం వుపయోగించుకుని ఈ నేల తల్లికి ఋణగ్రస్తులై వెళ్ళిపోతున్న తనలాంటి మేధావులవల్ల ఈ పుడమితల్లికి ఎంతటి పుత్రశోకం!' అనుకున్నాడు పరమేశం.

